# సుడి గుండం

న్యూటాన్

"ఇది గమనించావా?" అడిగాడు సత్యం, అప్పుడే లంచ్ ముగించి వచ్చి కూర్చున్న శివాన్ని.

"ఏమిటి?"

"ఈ మధ్య సుందరం హాఫ్‌డే లీవ్ పెట్టి తరచుగా వెళ్ళి పోతున్నాడు."

"అందులో అంత ప్రత్యేకంగా గమనించవలసిన అంశం ఏముంది? ఏదో గృహ సంబంధమైన పనుల మీద తిరుగుతూ ఉండవచ్చు" అన్నాడు శివం.

"అదిగో అదే నీకు, నాకు ఉన్న తేడా! ప్రతి విషయాన్నీ పైకి కనుపించేదే నిజమని నమ్ముతావు. తెలియని విషయం వెనక ఉందని వూహించవు."

"ఏమిటో అంత తెలుసుకో వలసిన విషయం."

"ఎ— సెక్షనులో చలపతి ఉన్నాడు తెలుసు కదా!"

"తెలుసు."

"అతను గుర్రపు పందాలు ఆడుతూ ఉంటాడు."

"అయితే!"

"చలపతి, సుందరం కలిసి వెళుతున్నారు."

"ఎక్కడికి?"

"గుర్రపు పందాలకు."

"నిజమా?" నమ్మలేక అడిగాడు శివం.

సత్యం, శివం సుందరం స్నేహితులు. ముగ్గురు ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు.

సుందరం ఒక ప్రత్యేక తరహాకు చెందిన వ్యక్తి. ప్రతి విషయం లోను చాలా రిజర్వ్‌డుగా ఉండే మనిషి. మితభాషి. స్నేహ పాత్రు డయినప్పటికీ అన్ని విషయాలు మిత్రుల ముందు బహిర్గతం చెయ్యటానికి ఇచ్ఛగించని మనస్తత్వం అతనిది.

"ఏ విషయమైనా పూర్తిగా తెలియకుండా మాట్లాడనని నీకు తెలుసు కదా!"

"కాదనను. కాని, సుందరం ఇలా ఎందుకు మారి పోయాడో అంతు పట్టకుండా ఉంది."

"తా చెడ్డ కోతి వన మెల్ల చెరిచింది అన్న సామెత ఉండనే ఉంది కదా! ఏ బలహీనమైన క్షణంలోనో మనవాణ్ణి చలపతి గోదాలోకి దించేశాడు."

"అందులో అనుమానం లేదనిపిస్తూంది."

"అనుమాన పడటానికే ముంది? ఇంతకు క్రితమే బస్సు మీద అయితే రేసెస్‌కు టైముకు చేరుకో లేమని ఆటో పిలిపించి మరీ వెళ్ళారు" అన్నాడు సత్యం తను చూసింది వివరిస్తున్నట్లుగా.

బాస్ సెక్షన్‌లోకి వచ్చి కూర్చోవటంతో ఎవరి పనులలో వారు బిజీగా ఉండిపోయారు.

● ● ●

'మునిగిపోయాడు, గురూ!' అన్నాడు సత్యం ఉపోద్ఘాతం లేకుండా మరో రోజు.

క్షణకాలం విషయం అర్థం కాక పోయినా వెంటనే గ్రహించ గలిగాడు శివం—అది సుందరం గురించేనని.

సుందరం గురించి ఇద్దర్నీ మథన పడటం, ఏం చెయ్యాలా అని ఆలోచించడం ఈ మధ్య తరచుగా జరుగుతూనే ఉంది.

అందుకే ఎవరు అని అడగలేదు శివం. సత్యం చెప్పదలుచుకున్న విషయాన్ని చెప్పక మానడని తనకి తెలుసు.

రెస్పాన్సు రాకపోవటంతో క్షణంసేపు చేస్తున్న పనిలోంచి తల పైకెత్తి శివం వైపు చూశాడు సత్యం.

ఏదో గమనించిన వాడిలా తిరిగి తనే ప్రారంభిస్తూ—"సుందరం నేను దగ్గర దగ్గర కాలనీలలో ఉంటున్నాం. తెలుసు కదా!" అన్నాడు సత్యం.

తెలుసు అన్నట్లు మొహం లోకి చూశాడు శివం మవునంగా.

"వాళ్ళకు, మాకు పాలు పోసే మనిషి ఒకడే. గత రెండు నెలల నుంచి అతనికి సుందరం డబ్బు ఇవ్వక, ఇదిగో అదిగో అని తిప్పు తున్నాడట. మీ స్నేహితుడు కదా, కాస్త చెప్పండి అంటూ ఇంకేవో అనరాని మాటలు అన్నాడు."

"అలాగ!" అన్నాడు శివం.

"అంతవరకే అయితే మునిగి పోయాడని నేను అనలేను."

"మరి?"

"విపులంగా తెలుసుకోగా...ఇంటిఅద్దె బాకీ, కిరాణా కొట్లో బాకీ ఉందని తెలిసింది."

"అంటే! సుందరం పెద్ద మొత్తాలలో డబ్బు గుర్రపు పందాలలో నష్ట పోతున్నాడన్నమాట."

"అవును. ఇక ఈ పరిస్థితిని కొనసాగనీయకూడదు" అన్నాడు సత్యం.

"కరెక్టు. మనం ఏదో ఒకటి చెయ్యాలి." బలపరిచాడు శివం.

"ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను. సుందరం లీవు నుంచి తిరిగి రాగానే మనం ఏదో విధంగా అతనికి నచ్చ చెప్పి ఆ మార్గం నుంచి మళ్ళించాలి" అన్నాడు సత్యం నిట్టూర్పు విడుస్తూ.

● ● ●

టైపు మిషన్ల టకటకలతో, కాలింగ్ బజర్ల కీచు గొంతుకలతో, హెడ్‌గుమాస్తా హెచ్చరింపులతో, బాస్ చిర్రు బుర్రులతో ఆఫీసు అచ్చంగా ఆఫీసులా ఉంది.

"సత్యం! అర్జంటుగా ఒక వంద రూపాయలు సర్దు గలవా?" అడిగాడు సుందరం.

తన పనిలో బిజీగా ఉన్న సత్యం అనుకోని ఆ పలకరింపుకు తల పైకెత్తి చూశాడు.

ఎదురుగా సుందరం నిలబడి ఉన్నాడు.

ఏ నాడూ అప్పు అడగని సుందరం తనను డబ్బు అడుగుతాడని వూహించ లేకపోయాడు.

వూహించని విషయం ఎదురు కావడంతో ఒక్క క్షణం నిశ్చేష్టుడై వెంటనే కోలుకున్నాడు.

"రా. . . సుందరం! కూర్చో" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపించాడు సత్యం.

సుందరం కూర్చుంటూ — "నేను అర్జంటుగా వెళ్ళాలి" అన్నాడు.

సత్యం ఎదురుగా ఉన్న గడియారం వంక చూశాడు అప్రయత్నంగా.

సమయం మధ్యాహ్నం పన్నెండుఏభై కావస్తూంది.

అంటే ఇంకో పది నిమిషాలలో లంచ్ అవర్.

సుందరం డబ్బు అడుగు తున్నాడంటే శలవు పెట్టి వెళ్ళిపోతున్నాడు. అత నెక్కడికి వెళుతున్నాడో తనకు తెలియంది కాదు.

"చూడు సుందరం! మిత్రుడిగా నీ కో మాట చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు సత్యం. అంతకంటే మంచి సమయం దొరకదన్నట్లుగా.

"ఏమిటి?"

"విషయం నీకు తెలియంది కాక పోయినా, కొన్ని కొన్ని ఇతరులు చెప్పే వరకు స్ఫురించవు."

"చెప్పు."


"ఒక పని చేసే ముందు మన మేమిటో, మన పరిస్థితి ఏమిటో, ఆ పని వల్ల మనకు ఒనకూడే లాభ నష్టాలేమిటో బేరీజు వేసుకోవటం చాలా అవసరం. కొన్ని కొన్ని కొంతమందికే పరిమితమన్న నగ్న సత్యాన్ని కూడ తెలుసు కోవాలి."

"చూడు, సత్యం! నువ్వు చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా చెప్పు. అవతల చలపతి నా కోసం ఎదురు చూస్తూ ఉంటాడు" అన్నాడు సుందరం.

"నిన్ను ఇబ్బంది పెట్టాలనేది నా ఉద్దేశం కాదు. చలపతి కంటే తాత ముత్తాతలు సంపాదించి పెట్టిన ఆస్తి ఉంది. అతనికి ప్రత్యేకమైన బరువు బాధ్యతలు లేవు. అతను గుర్రపు పందాలకు వెళుతున్నాడంటే అతని సంపాదన మీదే ఆధారపడిన వారు లేరు. మరి నీ మీద ఆధారపడిన కుటుంబ బాధ్యతలు చూడవలసిన అవసరం నీకుంది. నీ కంటూ నీ పెద్దలు సంపాదించి వదిలిపోయిన ఆస్తిపాస్తులు లేవని నీకూ తెలుసు. అటువంటి నీవు ఈ గుర్రపు పందాలు ఆడటం శోచనీయం. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇక నైన ఆ వ్యసనాన్ని విడనాడతావని భావిస్తాను. ఈ విషయానికి తప్పించి మరెందులోనైనా నా సహాయం ఎల్లప్పుడూ అందుతుంది" అన్నాడు సత్యం, తన హితబోధను ముగిస్తూ.

అంతవరకూ వారి మాటలు వింటూ అక్కడే నుంచున్న శివం — "సుందరం! నీ వెంతో తెలివైన వాడివని నీ మిత్రునిగా నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఆ చలపతి బారినుండి బయటపడి మా నమ్మకాన్ని వమ్ము చేయవని తలుస్తాను" అన్నాడు శివం అభ్యర్థన పూర్వకంగా.

"స్నేహితులని ఇంతసేపూ మీరు చెప్పింది వోపికగా విన్నాను. మీ ఉద్దేశం



మంచిదయినా ఒకళ్ళు వేరొకళ్ళను చెడగొట్టేది, బాగుపరిచేది ఉండనుకోవటం ఒట్టి భ్రమ. చలపతి ఎటువంటివాడో మీకు చెప్పబోవటం సాహసమే అవుతుంది. ఒక మనిషి కష్టాన్ని గాని, సుఖాన్ని గాని అనుభవిస్తున్నాడంటే అది కేవలం స్వయంకృతం వల్లనే అనేది మీరు తెలుసుకోవాలి. ఏమైనా, థాంక్యూ ఫర్ యువర్ పేషన్స్'' అంటూ వెళ్ళిపోయాడు సుందరం.

సుందరం ప్రవర్తన అర్థంకాని సత్యం, శివం ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

• • •

శీతాకాలం కావటంతో ఉదయం పదిన్నర అయినా చలిగానే ఉంది.

ఆఫీసులో అడుగు పెట్టిన సత్యం, శివం ఆ వార్త విని చలన రహితులై క్షణకాలం నిలిచిపోయారు. కొన్ని నిముషాలు అసలు ఆ వార్తనే నమ్మలేకపోయారు. మిన్ను విరిగి మీద పడినంత బాధపడ్డారు.

నిన్నటివరకూ కళ్ళముందు తిరిగిన సుందరం గుండెపోటుతో పోయాడని తెలిసిన క్షణం వారిని దుఃఖపూరితుల్ని చేసింది.

వెంటనే ఆఫీసుకు సెలవు పెట్టి సుందరం ఇంటికి వెళ్ళటానికి నిర్ణయించి బయలుదేరారు. కానీ, వారికి తెలిసిన మరో విషయం వారిని మరింత కదిలించివేసింది.

"క్రితం రోజు చలపతి, సుందరం మామూలుగా గుర్రపు పందాలకు వెళ్ళారట. మధ్యలో సుందరం ఛాతిలో కొంచెం నొప్పిగా ఉందన్నాడట. ఇంటికి వెళ్ళిపోదాం అన్న చలపతితో ఒద్దులే ఆదే పోతుంది ఈ చివరి రేసు కూడా చూసి వెళదాం అన్నాడట. చివరిదశలో బాధ ఎక్కువ కాగా, ఆటోలో వస్తూండగానే సుందరం చలపతి ఒళ్ళో ఒరిగిపోయాడట'' చెప్పాడు కొలీగ్ చంద్రం.

"వెంటనే చలపతి సుందరాన్ని డాక్టరుకు చూపించవలసింది'' అన్నాడు సత్యం ఎంతో ఆవేదనను వ్యక్తంచేస్తూ.

"అదేమో తెలియదు కానీ, సుందరాన్ని ఇంటికి తీసుకొచ్చిన చలపతి అతని భార్యాపిల్లల కోర్కె మీద వెంటనే

కారు ఏర్పాటు చేసి సుందరాన్ని స్వగ్రామం తీసుకు వెళ్ళాడని తెలిసింది'' అన్నాడు, చంద్రం తెలిసింది వివరిస్తూ.

''అంటే ఇప్పుడు ఇక్క డెవరూ లేరన్న మాట'' అన్నాడు శివం.

''అవును. ఎవరూ లేరనే అనుకోవాలి'' అన్నాడు చంద్రం ముందుకు నడుస్తూ, ఇక తను చెప్పవలసింది ఏమీ లేదన్నట్లు.

ఈ పరిణామం సత్యం, శివాన్ని మరింత అయోమయంలో పడేసింది. మిత్రుణ్ణి చివరి చూపుగా నైనా చూడలేక పోయినందుకు చాలా బాధపడ్డారు.

అసలు ఈ పరిస్థితికి కారణం చలపతే నన్న భావం వారి మనసుల్లో చలపతి ఎడల మరింత ఏహ్యభావాన్ని కలిగించింది.

• • •

''చలపతి పై అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాడట —సుందరం భార్యకు మన ఆఫీసులో ఉద్యోగం ఇవ్వమని'' అన్నాడు అప్పుడే ఏదో పని బడి 'ఎ' సెక్షనుకు వెళ్ళి వచ్చిన శివం.

నమ్మలేని విషయం వింటున్నట్లుగా ముఖం చిట్లించాడు సత్యం—శివం మాటలు వింటూ.

సత్యం భావాన్ని చదవ గలిగిన శివం—''అంతేకాకుండా చనిపోయిన సుందరం కుటుంబ సహాయార్థం చందాల పేరిట ఉద్యోగుల వద్ద డబ్బు కూడ పోగు చేస్తున్నాడని, ఆ డబ్బుని బాంక్ ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసి దాని మీద వచ్చే వడ్డీని నెలవారీ సుందరం కుటుంబం అనుభవించే ఏర్పాటు చేస్తున్నాడని అందరూ అనుకుంటున్నారు'' అన్నాడు.

''ఈజిట్ ...!'' అన్నాడు సత్యం.

తప్పిపోయాడనుకున్న వ్యక్తి అనుకోకుండా ఎదురవుతే కలిగే భావం ఏదో అతని కళ్ళల్లో ప్రస్ఫుటమవుతూంది.

''ముందు నేనూ ఆశ్చర్యపోయాను. కాని, చలపతి తన వాటాగా పెద్ద మొత్తాన్ని మన ఎంప్లాయిస్ ముందు స్పష్టంగా ప్రకటించాడట'' అన్నాడు శివం ఉద్వేగంతో.

సంభ్రమాశ్చర్యాలతో మునిగి పోయిన సత్యం ముఖంలో క్షణకాలం చలపతి పట్ల కృతజ్ఞతా భావం చోటు చేసుకుంది.

''శివం! ముందు మనం చలపతిని కలవాల నడువు'' అంటూ 'ఎ' సెక్షను వైపు దారితీశాడు.

సత్యం, శివం తన సీటు దగ్గరకు రావటం గమనించిన చలపతి సాదరంగా వారిని ఆహ్వానించాడు.

''చూడు, చలపతీ! సుందరం కుటుంబానికి నువ్వు చేస్తున్న సహాయం సుందరం మిత్రులుగా మా కెంతో ఆనందాన్ని చేకూర్చుతూంది'' అన్నాడు సత్యం సూటిగా.

''అది నా కర్తవ్యంగా భావించాను'' అన్నాడు చలపతి నిర్వికారంగా.

''చనిపోయిన మిత్రుడికి మేము చేయలేకపోయిన సహాయం నువ్వు చేసి చూపిస్తున్నావు. ఇంతకాలం నిన్ను తక్కువగా, మిత్రద్రోహిగా భావించినందుకు మమ్మల్ని క్షమించాలి'' అన్నాడు శివం పశ్చాత్తాపపడుతూ.

''లేదు. మీరే నన్ను మన్నించాలి. సుందరం కుటుంబానికి నా వల్లే ఇంతటి నష్టం చేకూరిందని అందరూ అనుకుంటున్నారు. ఏది ఏమైనా ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి త్రోవ చూపవలసిన బాధ్యత నాదే అని భావిస్తున్నాను'' అన్నాడు చలపతి తన వ్యధనంతా కంఠంలో ప్రతిఫలిస్తూ.

చలపతిలోని ఆ మార్పుకు చకితులైన మిత్రు లిద్దరూ ధైర్య వచనాలు పలుకుతూ అతని వద్ద సెలవు తీసుకున్నారు.

• • •

మూన్‌లైట్ బార్ దేదీప్యమానంగా, పదహారు సంవత్సరాల పడుచుపిల్లలా వింత అందాలతో వెలిగిపోతోంది.

పడుచు పిల్లలోని వయసుపొంగులా బారులోని జనం బ్రాంది, విస్కీలను గుటకలేస్తూ ఏవో లోకాలను తడిమి చూస్తున్నారు.

వైట్ హార్స్ విస్కీలో అప్పటికే మునిగిపోయిన చలపతి—తనలో తనే మాట్లాడుకోవటం చుట్టు ప్రక్కల ఎవరూ పట్టించుకోవడం లేదు. కాని, కావాలని విన్న వారికి మాత్రం ''దొంగ బాస్టర్డ్స్! విన్నటి వరకూ సుందరాన్ని చెడగొట్టాడని ఏడ్చిన వీళ్ళు నే నేదో ఆ కుటుంబాన్ని ఉద్ధరించేస్తున్నానని వచ్చి మొసలి కన్నీళ్ళు కారుస్తున్నారు. నేను బ్రతికి ఉండి సాధించ లేనిది చచ్చి సుందరం నాకు సాధించి పెట్టాడు. తను పోతూ ఆ జాక్‌పాట్ మూడు లక్షలు నాకు వదిలి వెళ్ళిపోయాడు. పాపం! పూర్ చాప్! డబ్బుకి డబ్బు, పేరుకి పేరు దక్కింది. హాట్సాఫ్‌లు లేటు మిస్టర్ సుందరం'' అన్న మాటలు వినిపించకపోవు. ★




'ప్రతి రోజూ కావాల్సిన తాజాదనం, స్ఫూర్తి'




అందరూ ఎరిగిన గుర్తించిన శక్తినిచ్చే, ఫలితానిచ్చే ఒకాసా

ఉరుకులూ, పరుగులతో నేటి దైనందిన జీవితంలో, మీరు పోగొట్టుకునే శక్తిని... ఒకాసావల్ల తిరిగి పొందగలుగుతారు మీరు.

ఒకాసా ప్రతి బిళ్ళలోనూ, శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలూ, 6 ఖనిజాలూ, 10 విటమిన్లూ, అపరూపమైన మూలికల సారమూ ఉంది. శక్తి నిచ్చే మరే ఇతర టానిక్ అయినా దీనికి సాటిరాదిక. ఔషధయుక్తంగా ప్రభావిత మైన, ప్రపంచ ప్రసిద్ధమైన ఒకాసా, మిమ్మల్ని శక్తితో, ఉత్సాహంతో నింపుతుంది. ప్రతిరోజూ, అదీ ప్రత్యేకమైన తీరులో. ప్రతిరోజూ.

20 రోజులకు పనికొచ్చే విలైన కొత్త ప్యాక్‌లో

పేరెన్నికగన్న మందుల దుకాణాలన్నిటిలోనూ దొరుకుతుంది.

ఒకాసా

ఒకాసాని గూర్చిన ఉచితపు పుస్తకం కోసం వ్రాయండి.

OKASA CO. PVT. LTD. Post Box No. 396, Bombay-400 001.

073

ఎమెస్కో క్రైమ్ బుక్స్ సిరీస్

ఆగష్టు 82 విడుదల

మనసు కథతో
మిమ్మల్ని ఉర్రూతలూగించిన
వాసిరెడ్డి సీతాదేవి
మరో సైకలాజికల్ థ్రిల్లర్, డైరెక్టు నవల

మరో మనసు కథ

ప్రేమికుడి అతిచిత్రమైన
కాంప్లెక్సెస్ వెలికితీసే...

మరో మనసు కథ

వెల రూ: 12/-లు మాత్రమే

ప్రతులకు
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237 రాష్ట్రపతి రోడ్ * సికింద్రాబాద్-500003